# శల్యపర్వ కథాంశాలు

ఇందు 3 ఉపపర్వములు, 65 అధ్యాయాలు, 3659 శ్లోకాలు వున్నాయి.

అర్జునునిచే కర్ణుడు చంపబడగా దుర్యోధనుడు శోకసముద్రమున మునిగిపోయెను. రాజులందరిలో నిరాశానిస్పృహలావరించెను. యుద్ధమున మిగిలిన రాజులు తమతమ శిబిరములకు చేరుకొనిరి. దైవసంకల్పము ప్రబలమైనదని తలచి కౌరవసేన తిరిగి యుద్ధమునకు బయలుదేరెను. యుద్ధమున ఎంతోమంది సైనికులు మరణించుటను చూచి దుర్యోధనుడు చింతాక్రాంతుడాయెను. అతని దయనీయ పరిస్థితిని చూచి కృపాచార్యునికి దయకలిగెను. అతడు దుర్యోధనునితో "యుద్ధమున చచ్చుట లేక చంపుట రెండును ఉత్తమధర్మములే. యుద్ధరంగమున వీడి పారిపోవుట మహాపాపము. భీష్మ, ద్రోణ, లక్ష్మణకుమారులు కూడా ఈలోకమున లేరు. యుద్ధమున జయించుట అసంభవమని తోచుచున్నది. కనుక యుధిష్ఠిరుని వద్ద తలవంచి అతని రాజ్యమతనికిచ్చెదము. అతడెంతో దయాళువు. ధర్మరాజు తప్పక నిన్ను రాజ్యమందు ప్రతిష్ఠించును." అని చెప్పగా అతని మాటలు దుర్యోధనునకు రుచించలేదు. అతడు కృపాచార్యునితో "మరణమాసన్నమైన వ్యక్తికి మందు రుచించనట్లు మీమాటలు నాకు రుచించటంలేదు. మనం యుధిష్ఠిరునితో వంచనతో వ్యవహరించితిమి. మోసంతో జూదమున జయించి అతనిని నిర్ధనుని చేసితిమి. శ్రీకృష్ణుడు రాయబారమునకు వచ్చినను అతనిని వంచించితిమి. ఇప్పుడు పాండవులు నామాట ఎందుకు విందురు? నిండుసభలో ద్రౌపది పరాభవమును, బలాత్కారముగ రాజ్యమునపహరించుటను వారు ఎట్లు మరవగలరు. అభిమన్యునిచంపి మనం వారియెడల అపరాధులమైతిమి. వారు మనలను క్షమింపరు. కనుక సంధి ప్రస్తావన అనునది ఇప్పుడు లేనట్లే. విజయమో వీరస్వర్గమో యుద్ధము చేయుటయే శ్రేయస్కరము. పిరికితనమునకు ఇది సమయముకాదు. ఉత్సాహముతో యుద్ధముచేసెదము. యుద్ధమున వెన్ను చూపక తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనువాడు స్వర్గమును పొందగలడు. యుద్ధమున ప్రాణములు వదిలిన వానిని పితృగణము, దేవతలు కూడా సమ్మానింతురు. శూరవీరులు యుద్ధమున మరణించి

ఇంద్రలోకమును పొందుచున్నారు. సోదరులను, పితామహులను పోగొట్టుకొని ఇప్పుడు నాప్రాణములను కాపాడుకొనిన లోకమంతయూ నన్ను నిందించును. యుధిష్ఠిరుని కాళ్లమీద పడుటవలన వచ్చు రాజ్యముతో నాకేమి పని? కనుక యుద్ధము ద్వారా స్వర్గమును పొందుటయే శ్రేయస్కరమని చెప్పెను." దుర్యోధనుని మాటలను క్షత్రియగణము ఆదరించి తమ పరాక్రమమును చూపుటకు నిశ్చయించిరి.

ఎవరో ఒకరిని సేనాపతిని చేయవలసినదని వీరగణము దుర్యోధనుని కోరెను. అశ్వత్థామ సేనాపతిపదవికి శల్యుడు యోగ్యుడని చెప్పుచూ అతడు సమస్త సద్గుణసంపన్నుడు. తన సోదరి పుత్రులను విడిచిపెట్టి కౌరవపక్షమున యుద్ధము చేయుచున్నాడు. గొప్ప సైన్యసంపత్తి కలవాడని సూచించెను. దుర్యోధనుడు శల్యుని పాండవులకు వ్యతిరేకముగ సైన్యాధ్యక్షపదవిని స్వీకరించమని కోరగా శల్యుడు "రాజా! నీవు కోరునది తప్పక పూర్తిచేయగలను. ప్రాణములర్పించైనా నీకు హితమును కలుగ జేసెదనని" పలికెను. దుర్యోధనుడు మద్రరాజగు శల్యుని సేనాపతిపదవియందు అభిషిక్తుని చేసెను. కౌరవసేనయందు తిరిగి ఉత్సాహము బయలుదేరెను. "ఈ రోజుయుద్ధమున సమస్తపాండవులను చంపెదను, లేదా వీరమరణము పొంది స్వర్గమునకు పోయెదనని" శల్యుడు ప్రతిజ్ఞ చేసెను. ఈరోజు నాప్రతాపమును పాండవులు చూడగలరు. పాండవసేనను చెల్లాచెదరు చేసెదను. ద్రోణ, కర్ణ, భీష్ములకంటే మించి పరాక్రమమును చూపెదనని శల్యుడు పలికెను. కౌరవసేనకు అధిపతి శల్యుడని తెలుసుకొని పాండవులు చింతాక్రాంతులైరి. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో "నరేశ్వరా! ఎంత ఆలోచించినను శల్యునితో సమానమగు పరాక్రమవంతుడు మరొకరు కనుబడుట లేదు. శల్యుని ఎదుర్కొనగల సామర్థ్యము మీకే ఉన్నది. మీరు తప్ప సంపూర్ణజగత్తున శల్యుని చంపగల వీరుడు మరొకరు లేడు. కనుక మీరు ఈరోజు యుద్ధమున శల్యుని చంపవలసినదని" చెప్పెను. అంతట యుధిష్ఠిరుడు యుద్ధమునకు సన్నద్ధుడాయెను.

ఇరుపక్షములమధ్య ఘోరయుద్ధము జరిగెను. నకులుడు కర్ణపుత్రుడగు చిత్రసేనుని ఆక్రమించెను. చిత్రసేనుడు నకులుని

ధనుస్సును విరిచి గుఱ్ఱములను చంపెను. నకులుడు కత్తి, డాలు తీసుకొని చిత్రసేనుని మీదికి ఉరికి అతని శిరస్సును ఖండించెను. చిత్రసేనుని సోదరులు నకులునిపై బాణవర్షము కురిపించగా నకులుడు వారి గుఱ్ఱములను చంపి, ధనస్సులను విరగ్గొట్టెను. సోదరులలో ఒకడగు సత్యసేనుని వక్షఃస్థలమును చీల్చగా సుషేణుడు కోపంతో నకులునిపై బాణవర్షం కురిపించెను. నకులుడు బాణప్రహారంతో సుషేణుని శిరస్సు ఖండించెను. శల్య భీమసేనులమధ్య భీకరమగు గదాయుద్ధము జరిగెను. దుర్యోధనుడు పాండవ పక్షమునకు సంబంధించిన చేకితానుని, యుధిష్ఠిరుడు కౌరవపక్షమువారైన చంద్రసేన, ద్రుమసేనులను వధించెను. శల్యుడు యుద్ధక్షేత్రమున నాల్గువైపులా ఆక్రమించెను. పాండవసేన అతనిని
ఎదుర్కొనలేక అచ్చటినుండి తొలగి మరొక చోట యుద్ధము చేయసాగిరి. పిమ్మట అర్జునునితో అశ్వత్థామ యుద్ధము చేయసాగెను. ఆయుద్ధమున అశ్వత్థామ ఎంతోమంది పాండవవీరులను చంపెను. దుర్యోధన ధృష్టద్యుమ్నుల మధ్య ఘోరయుద్ధము జరిగెను. యుధిష్ఠిర శల్యుల మధ్య భయంకరయుద్ధము ప్రారంభమాయెను. యుధిష్ఠిరుని రథసారథి, గుఱ్ఱములు చంపబడినవి. దానిమీదనుండి ధర్మరాజు శల్యుని చంపుటకు అతనిపైకి శక్తిని ప్రయోగించెను. శల్యుని వక్షఃస్థలమును చీల్చి శక్తి భూమిలో కలసిపోయెను. శల్యుడు చంపబడగా అతని సోదరుడు యుధిష్ఠిరునిపైకి దండెత్తెను. ధర్మరాజు అతని ధనుస్సును, ధ్వజమును విరగొట్టి, అతని శిరస్సును ఖండించెను. పిమ్మట కృతవర్మ యుధిష్ఠిరునితో తలపడెను. యుధిష్ఠిరుడు కృతవర్మ గుఱ్ఱములను వధించెను. విపత్కరపరిస్థితిని గమనించి అశ్వత్థామ కృతవర్మను సురక్షిత ప్రదేశమునకు తీసుకువెళ్లెను

కౌరవపక్షరాజులలో శ్రేష్ఠుడగు శాల్వుడు పాండవుల నాక్రమించెను. అంతట సాత్యకి శాల్వరాజు శిరస్సును ఖండించెను. కౌరవపక్షసేన ఓడిపోవుటను గమనించిన శకుని మోసపూరితమగు యుద్ధమును ప్రారంభించెను. కాని పరాజయము పొందెను.

భీమసేనుడు దుర్యోధనుని పదకొండుగురు సోదరులగు దుర్మర్షణ, శ్రుతాంత, జైత్ర, భూరిబల, రవి, జయత్సేన, సుజాత, దుర్విషహ, శత్రునాశక, దుర్విమోచన, దుష్ప్రధర్షులను చంపెను.

కౌరవపక్ష ప్రముఖవీరుడు త్రిగర్తరాజగు సుశర్మ అర్జునునితో తలపడెను. యమదండము వంటి భయంకరబాణముతో అర్జునుడు సుశర్మను చంపెను. మరొకవైపు శకుని సహదేవుల మధ్య యుద్ధము ఆరంభమాయెను. శకుని తన ప్రాసముతో సహదేవుని శిరస్సును మోదగా అతడు గాయపడి రథముపైనే కూర్చుండిపోయెను. అతని అవస్థను చూచి భీమసేనుడు శకునిని అడ్డుకొనెను. పిమ్మట తేరుకొని సహదేవుడు శకుని గుఱ్ఱములను చంపి, ధనుస్సును ముక్కలుముక్కలు గావించెను. యుద్ధక్షేత్రమున తనతండ్రిని రక్షిస్తూ ఉలూకుడు భీమసేన సహదేవులను ఎదుర్కొనెను. అంతట పరాక్రమవంతుడగు సహదేవుడు ఉలూకుని మస్తకమును ఖండించెను.

పుత్రుని మరణంవలన శకుని రెండుక్షణములవరకు నిశ్చేష్టుడై చింతలో మునిగి పోయెను. పిమ్మట తేరుకొని సహదేవునిపై దండెత్తి బాణవర్షము కురిపించెను. సహదేవుడు ప్రత్యాక్రమణముచేసి అతని ధనుస్సును విరిచి, గుఱ్ఱములను చంపి అతనిని గాయపరచెను. పిమ్మట ద్యూతమున అతని అకృత్యములను స్మరించుచు
తేజోవంతమగు బాణముతో అతని శిరస్సును ఖండించెను.

ఇక ఇప్పుడు దుర్యోధనుని వద్ద అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు మినహా మరియెవ్వరూ జీవించిలేరు. ఇటువంటి విపత్కరసమయంలో తనను నిస్సహాయుడుగా తలచి దుర్యోధనుడు ప్రాణములను కాపాడుకొనుటకు సరోవరమున ప్రవేశించి మాయావిద్యతో నీటిని బంధించెను. ఈవిషయము తెలియగానే అశ్వత్థామాదులు శత్రువులతో పోరాడుటకు ఇంకామేము ముగ్గురము మిగిలియుంటిమని దుర్యోధనునకు తెలియదా యని అతనిని చీత్కరించిరి. పిమ్మట వారు ముగ్గురు రణనీతిని తయారుచేసుకొనుటకు దుర్యోధనుని కలియుటకై సరోవరం వద్దకు వెళ్లిరి. దుర్యోధనుడు వారిని సముదాయిస్తూ "మీరంతా బాగా అలసిపోతిరి. విశ్రాంతి తీసుకొనుడు. నేను కూడా అలసిపోతిని. ఇప్పుడు పాండవులపక్షము బలముగానున్నది. కనుక వారితో ఇప్పుడు యుద్ధము చేయుటకు రుచించుటలేదు. మీలో యుద్ధోత్సాహముండుట యనునది అద్భుతమేమీ కాదు. కాని మీ పరాక్రమమును చూపుటకు ఇది తగిన సమయము. ఈ ఒక్కరాత్రి విశ్రాంతి తీసుకొని రేపు మీతో కలసి శత్రువులతో పోరాడెదని" చెప్పెను.

పాండవులు కూడా దుర్యోధనుని సమాచారముకై వెదకుచుండిరి. వ్యాధులు సరోవరం దగ్గర ముగ్గురు మహారథులతో దుర్యోధనుడు చర్చించుటను పాండవులకు తెలియజేసిరి. దుర్యోధనుడు నీటిలో దాగియున్నాడని తెలిసి యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని తీసుకొని సరోవరమునకు చేరిరి. సరోవరమున దుర్యోధనుడు మాయద్వారా నీటిని స్తంభింపజేసి అందు విశ్రాంతి తీసుకొనుచున్నాడు. అతనిని గమనించుట చాలా కష్టము. సరోవరంలో దాగియున్న దుర్యోధనుడు సరోవరం దగ్గర మేఘగర్జన వంటి భయంకర శబ్దమును వినెను.

సరోవరం దగ్గరకు చేరి యుధిష్ఠిరుడు జలస్తంభనము చేసి దుర్యోధనుడు అందు దాగిఉన్నాడని తెలుసుకొని అతనితో "దుర్యోధనా! నీవు ఎందువలన నీటిలో దాగితివి? సమస్త క్షత్రియకులమును నాశనము చేయించి ప్రాణములను కాపాడుకొనుటకు దాగియుంటివా? లేచి పైకిరా మాతో యుద్ధము చేయుము. మునుపటి దర్పము, అభిమానము ఏమైనవి? భయపడి నీటిలో సేద తీర్చుకొనుచున్నావు. నీపరాక్రమమంతయు వ్యర్థమే. యుద్ధము చేయక వెనుదిరుగుట క్షత్రియధర్మము కాదు. అధములు ఇట్టి పనులు చేసెదరు. దీనివలన స్వర్గము లభించదని" అవహేళన చేయగా జలమందుదాగిన దుర్యోధనుడు "నేను ప్రాణభీతితో ఇక్కడకు రాలేదు. నాదగ్గర రథము లేదు. ఆయుధములు లేవు. అంగరక్షకులు కూడా మరణించిరి. నాసేన నష్టమాయెను.
యుద్ధస్థలమున ఒంటివాడనగుటచే కొంతసేపు విశ్రాంతి తీసుకొనదలచితిని. మీరు కూడా విశ్రమింపుడు. పిమ్మట మీతో యుద్ధము చేయగలను. నేను ఎవరికోసం రాజ్యము కోరుకుంటినో సోదరులైన వారంతా మరణించిరి. భూమండలమందలి సమస్త క్షత్రియుల సంహారము జరిగినది. రత్న సంపద నాశనమాయెను. సౌభాగ్యరహిత స్త్రీ వలె కనబడుచున్న ఈ భూమండలమును ఏలుకొనుటకు నాకు ఉత్సాహము లేదు" అని పలుకగా యుధిష్ఠిరుడు "దుర్యోధనా! నీవు నీటిలో దాగి ఆర్తపురుషునివలె ప్రలపించవలదు. పక్షుల కిలకిలధ్వనులవలె నీమాటలకు ఎటువంటి అర్థము తోచటంలేదు. నన్ను యుద్ధమున జయించి భూమిని పాలింపుము. సూదిమొనయంత భూమిని కూడా ఇచ్చుటకు మొదట నీవు ఇష్టపడలేదు. మరి ఇప్పుడు రాజ్యమంతటిని నాకెట్లు ఇచ్చుచున్నావని"

అడిగెను. యుధిష్ఠిరుని మాటలు విని దుర్యోధనుడు విషమపరిస్థితిలోపడి నిట్టూర్చసాగెను. నీటిలోపలనుండి బాగా ఆలోచించుకొని యుద్ధము చేయుటకు నిశ్చయించి దుర్యోధనుడు యుధిష్ఠిరునితో "నేను ఒంటరిగా అలసిపోయియుంటిని. రథములేదు. గుఱ్ఱములు లేవు. నీసేన అధికము. నీతో ఒంటరిగా అస్త్రశస్త్రములు లేకుండ ఎట్లు యుద్ధము చేయగలను? మీలో ఒక్కొక్కరు నాతో యుద్ధము చేయుడు. మీరిందరు కలసి నాఒక్కడితో యుద్ధము చేయుట న్యాయము కాదు. నాకు ఎవరన్నను భయము లేదు. నేనొక్కడినే మీరందరిని ముందుకు అడుగువేయకుండా అడ్డుకోగలనని పలికెను." అంతట యుధిష్ఠిరుడు దుర్యోధనునితో "నీవు కోరినట్లు మాలో ఒక్కరితోనే కోరిన ఆయుధముతో యుద్ధము చేయవచ్చును. మాలో ఏ ఒక్కరిని చంపినా రాజ్యము నీకే దక్కునని మాట ఇచ్చుచున్నాను. ఒకవేళ నీవు చంపబడినచో స్వర్గలోకమును పొందెదవని" చెప్పెను. అదివిని దుర్యోధనుడు "నేను గదాయుద్ధమును ఇష్టపడెదను. మీలో ఎవరైనా నాతో గదా యుద్ధమునకు రమ్మనమని" చెబుతూ లోహమయమగు గదను తీసుకొని నీటినుండి బయటకు వచ్చెను. తన శిష్యులగు భీమ దుర్యోధన గదాయుద్ధమును చూచుటకు బలరాముడు అచ్చటకేతెంచెను. ఇద్దరిమధ్య భీకరగదాయుద్ధము ఆరంభమాయెను.

బలరాముని తీర్థయాత్రలు, ప్రభాసక్షేత్రమహిమ వర్ణించుసందర్భమున చంద్రుని శాపవిమోచనవృత్తాంతము విస్తృతముగ చెప్పబడెను. సమంతపంచకభూమి దేవలోకమున ప్రజాపతియొక్క ఉత్తరవేదియను పేరుతో ప్రసిద్ధమని బలరాముడు పేర్కొనెను. పరమపావనమగు అట్టి ప్రదేశమున యుద్ధమున మరణించువారు స్వర్గలోకమును పొందెదరు. పిమ్మట యుధిష్ఠిరుడు సమంతపంచకక్షేత్రమునకు
నడువగా కాలిబాటన దుర్యోధనుడుకూడా గదాయుధుడై వారిని అనుసరించెను. భీమదుర్యోధనులమధ్య అశ్చర్యము గొలుపునట్టు యుద్ధము జరిగెను. యుద్ధముసమయమున భీముని గద నేలపైపడగా అదే సమయములో దుర్యోధనుడు వంచనతో భీముని వక్షఃస్థలముపై గదతో కొట్టగా అతడు మూర్ఛపోయెను. తిరిగి తెలివి తెచ్చుకొని భీముడు దుర్యోధనుని ఆక్రమించెను. ఇరువురి శరీరములు రక్తంతో తడిసినవి.

దుర్యోధనుని ఆక్రమించిన భీముడు వేగంతో గద తిప్పి అతని తొడలు విరగ్గొట్టెను. దుర్యోధనుడు నేలకొరుగగా పాండవులు సంతసించిరి. యుధిష్ఠిరుడు దుర్యోధనునితో "నీవు శోకించవలదు. వీరస్వర్గము నీకు లభించబోవుచున్నది. బంధుమిత్రులను పోగొట్టుకొని మేమే దయనీయస్థితిలోనున్నామని" పలికెను.

భీమసేనుడు దుర్యోధనుని శిరస్సును కాలితో తన్నుటను చూచి కోపగించిన బలరాముడు "భీమసేనా! నీకు ధిక్కారము. ధర్మయుద్ధమున నాభికి దిగువభాగమును గదాప్రహారముచేయుట నేను ఎక్కడా చూడలేదు. నీవు అపరాధము చేసితివని" పలికి తన ఆయుధముగు నాగలిని తీసుకొని భీమునివైపు పరిగెత్తెను. శ్రీకృష్ణుడు బలరాముని ప్రయత్నపూర్వకంగా నిలుపుచేసి "సోదరా! దుర్యోధనుడు పాండవులయెడల ఎంతో కపటంతో వ్యవహరించినాడు. దుర్యోధనుడు తొడలు విరగ్గొట్టెదనని భీముడు ప్రతిజ్ఞచేసియున్నాడు. మైత్రేయ మహర్షి కూడా భీమసేనుడు గదతో దుర్యోధనుని తొడలు విరగగొట్టునని శాపమిచ్చినాడు. కనుక నేను భీమసేనుని అపరాధిగా చూచుటలేదు" అని సముదాయించెను.

భీమసేనుడు నేలకొరిగిన దుర్యోధనుని శిరస్సును కాలితో తన్నుట యుధిష్ఠిరునకు కూడా రుచించలేదు. కులనాశనముతో అతడు అసంతోషముగా ఉండెను. కాని అధర్మమార్గంలో సంచరించే దుర్యోధనుని వధను కూడా కోరెను. శత్రువులను తుదముట్టించినందులకు యుధిష్ఠిరుడు భీముని ప్రశంసించెను.

పిమ్మట పాండవులు దుర్యోధనుని శిబిరమునకు వెళ్ళిరి. స్వామిమరణంతో శిబిరం కాంతివిహీనమాయెను. తరువాత శ్రీకృష్ణుడు అర్జునునితో గాండీవధనుర్బాణములను క్రిందకు దించి, రథమునుండి క్రిందికిదిగుమని ఆదేశించెను. అర్జునుడు రథముదిగిన తరువాత శ్రీకృష్ణభగవానుడు రథముదిగగా ధ్వజస్వరూపమగు దివ్యవానరము రథమునుండి అంతర్ధానమాయెను. రథము అగ్నికి ఆహుతి ఆయెను. అదిచూచి పాండవులు ఆశ్చర్యచకితులైరి. రథము అగ్నికి ఆహుతియగుటకు కారణమును అర్జునుడు అడుగగా శ్రీకృష్ణుడు "దివ్యాస్త్రములతో రథము ముందే దగ్ధమైనది. నీయభీష్టము నేడు నెరవేరినది. నేను రథముపై

కూర్చొనుటవలన ఇంతవరకు దగ్ధమై క్రింద పడలే"దని చెప్పెను. అటుతరువాత శ్రీకృష్ణుడు హస్తినాపురమునకు వెళ్ళి ధృతరాష్ట్రగాంధారులను ఓదార్చి తిరిగి పాండవుల వద్దకు వచ్చెను.

తొడలు విరుగుటచే నేలకొరిగిన దుర్యోధనుడు భీముని అధర్మవ్యవహారమును తలచుకొని విలపించసాగెను. దుర్యోధనుని దురవస్థను, భీమసేనుని అనుచిత వ్యవహారమును సందేశవాహకులు అశ్వత్థామకు తెలియజేసిరి.

దుర్యోధనుని దురవస్థను తెలుసుకొని అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు యుద్ధభూమికి వచ్చిరి. దుర్యోధనుని అవస్థను చూచి అశ్వత్థామ దుఃఖించెను. దుర్యోధనుడు కన్నీళ్ళతో "మీకందరికి నామీద స్వాభావికముగు స్నేహముకలదు. మీరు దుఃఖించుట ఉచితము కాదు. శ్రీకృష్ణుని మాటలను అంగీకరించి క్షత్రియధర్మమునుండి చలించలేదు. దాని ఫలమును పొందితిని. కనుక నావిషయమున మీరు శోకించుట తగదని" చెప్పెను.

అశ్వత్థామ దుర్యోధనునితో "నీచపాండవులు అధర్మముగ నాతండ్రిని చంపినప్పుడు కలిగిన దుఃఖముకంటే ఎక్కువ దుఃఖమును మీవధ కారణముగ అనుభవించుచున్నాను. శ్రీకృష్ణుడు చూస్తుండగానే శత్రువులను యమలోకమునకు పంపెదనని శపథము చేయుచున్నానని" పలుకగా ప్రసన్నుడైన దుర్యోధనుడు అశ్వత్థామను సేనాపతిని చేయవలసినదిగా కృపాచార్యుని కోరెను.

**ఇది శల్యపర్వ కథాంశము.**